## పేషెంట్ చెప్పేకథలు



# రాక్షసుడు

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

"అయ్యో! ఏమిటమ్మా యిది? ఈ దెబ్బలేమిటి?" ఆదుర్దాగా అడిగింది శ్రుతి.

"అటక యెక్కబోయి జారిపడిపోయాను." బలవంతాన బాధను ఓర్చుకుంటూ జవాబిచ్చింది సావిత్రి. రక్తాన్ని దూదితో తుడుస్తూ, పరిశీలనగా గాయాల్ని చూస్తూ ఆలోచిస్తూంది శ్రుతి.

వారం క్రితం భర్తను వెంటబెట్టుకొచ్చిన సావిత్రి గుర్తుకొచ్చింది. రోజా రంగు చెక్కిళ్ళు, చిరుసిగ్గుతో వాలిపోతున్న కళ్ళు, చూడగానే ఆకర్షిస్తున్న అలంకరణ. కాసేపు మాట్లాడుతూ కూర్చున్నారు.

సావిత్రి భర్త, సోమేశ్వర్రావు పదేళ్ళనుంచి కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది ఇద్దరుపిల్లలు. సంవత్సరానికోసారి రెండు నెలలు సెలవు తీసుకుని వస్తూ వుంటాడు.

"సావిత్రీ నీ పిల్లల్నికూడా అక్కడికి తీసుకెళ్ళిపోవచ్చుకదా మీరు? ఏళ్ళ తరబడి యిలా విడిగావుండడం కష్టంకాదూ?" మాటలమధ్యలో అతన్ని అడిగింది శ్రుతి. అంతవరకు నవ్వుతూ మాట్లాడుతున్న అతని కళ్ళల్లో విషాదం సుళ్లు తిరిగింది.

"ఎందుకు కష్టంగా లేదూ? ఒకోసారి వెధవ ఉద్యోగాన్ని విడిచిపెట్టి పరిగెత్తుకు పారిపోయి రావాలనిపిస్తుంది. బాగా తిరుగుతున్నప్పుడు ఫరవాలేదు. కొంచెం ఒంట్లో బాగోలేకపోతే చాలు, యింక జబ్బు తగ్గనే తగ్గదేమో, అక్కడే దిక్కూ మొక్కూ లేకుండా చనిపోతానేమో, నా వాళ్ళనింక చూడలేనేమోనని అధైర్యం కలుగుతుంది. నా పక్కలు వెచ్చబడితే చాలు, అగ్గగ్గలాడిపోయే అమ్మను తలచుకుంటే ఏడుపు ముంచుకొస్తుంది. సావిత్రి, పిల్లలు కళ్ళముందు మెదిలితే చాలు రెక్కలు కట్టుకుని ఎగిరి రావాలనిపిస్తుంది. కాని.... రాలేను. ఉద్యోగాన్ని విడిచిపెట్టనూలేను, వచ్చి యిక్కడ కూలి చేసుకుని బ్రతకనూలేను. యిక్కడే పనిలోనూ నిలదొక్కుకోలేకే, అవకాశం కలిసొచ్చి అక్కడకు వెళ్ళాను. మంచో చెడో ఒకరకమైన బ్రతుక్కి అలవాటుపడిపోయాను. నా భార్య, పిల్లలు, అమ్మ, తమ్ముడు లోటు లేకుండా బ్రతకగలిగినంత పంపగలుగుతున్నాను. యింతమందినీ అక్కడికి తీసుకెళ్ళి పోషించలేను. కొద్దో, గొప్పో వెనకేసి, కూడబెట్టుకువచ్చి యిక్కడేదన్నా వ్యాపారం చేసుకు బ్రతకాలని నా తాపత్రయం. అప్పటిదాకా ఈ బాధ, ఎడబాటు తప్పవు" సుఖజీవనం కోసం పోరాటం. పట్టుదల, అధైర్యం, సంఘర్షణ, త్యాగాలు, కన్నీళ్లు - ఆసక్తిగా వాళ్ళని గమనించింది శ్రుతి. అదంతా కళ్ళముందు కదలింది.

"రోజూ ఇంజక్షన్‌కి వస్తావా? కాప్స్యూల్స్ రాసివ్వనా?" టెటనస్‌టాక్సాయిడ్ ఇంజెక్షన్ చేస్తూ సావిత్రిని అడిగింది శ్రుతి.

"ఇంజక్షన్ చేయించుకుంటానమ్మా! త్వరగా మానాలి." భర్తవున్న నాలుగు రోజులు ఆరోగ్యంగా వుండక యిలా జరిగిందన్న వ్యధకదిలింది సావిత్రి కళ్ళల్లో.

మరునాడు సావిత్రివెంట ఆమె భర్త కూడా వచ్చాడు. గాయాలు తగిలినచోట డ్రెస్సింగ్‌చేసి, ఇంజక్షనిచ్చాక సావిత్రిని బయట కూర్చోబెట్టి అతను శ్రుతి రూమ్‌లోకివచ్చాడు.

"ఫరవాలేదుకదా డాక్టర్‌గారూ?!" భయంగా అడిగాడతను.

"ఏం ఫరవాలేదు. రెండురోజుల్లో బాగా తగ్గిపోతాయి" ధైర్యం చెప్పింది శ్రుతి.

ఒక నిమిషం తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడతను.

"నన్ను పరీక్షచేసి మంచి మందివ్వాలి డాక్టర్!" గిల్టీగా చూస్తూ అన్నాడతను.

"మిమ్మల్నా?!" ఆరోగ్యంగా కనిపిస్తున్న అతనివంక చూస్తూ అడిగింది శ్రుతి. అంతలోనే అతని కళ్ళల్లో పలచటి నీటిపొర కమ్మింది. ఒక నిమిషంలో తమాయించుకున్నాడు.

"సావిత్రి పడిపోలేదు. నేనే కొట్టాను" ఆశ్చర్యంగా అతనివంక చూస్తూంది శ్రుతి. భార్యని అపురూపంగా చూసుకునే యితనా అంత దారుణంగా కొట్టింది? ఏ పరిస్థితుల్లో, ఏ భావోద్రేకంలో అతనా పని చేశాడు?!

"నిజమే. నేనే కొట్టానండి. సావిత్రి నా ప్రాణం. కాని.... కాని.... నేను ఊహించుకునేదంతా అబద్ధమే. సావిత్రి నిప్పు అంటుంది అమ్మ.... సడెన్‌గా నాలో అనుమానపు భూతం లేస్తుంది. నేనిక్కడ లేని సమయంలో సావిత్రి ఎవరితోనైనా.... ఛీ! ఛీ! మామూలుగా సావిత్రి గురించి యిలా అనుకుంటానికే అసహ్యం. నాలో రాక్షసుడు బయటికొచ్చినప్పుడు యిదేమీ గుర్తుకు రాదు. సావిత్రిని కొట్టి, తిట్టి హింసించడం ఆ రాక్షసుడి ఆనందం" మాటలు పేర్చుకుంటూ, దీనంగా తన గురించి చెప్పుకుంటున్న అతనివంక జాలిగా చూసింది శ్రుతి.